రసాయనాలు పారబోస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పద్మానగర్‌లోని ఓపెన్ నాలాలో పారబోసిన రసాయన వ్యర్థాలతో వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పద్మానగర్, పర్వత్‌నగర్, కమల్‌నగర్, మూసానగర్, రసూల్‌పుర, శంకర్‌నగర్ బస్తీలోని కుటుంబీకులు ఆ దుర్వాసనతో తీవ్ర ఇక్కట్లకు లోనవుతున్నారు. ఈ విషయమై స్థానిక బస్తీవాసులు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే బస్తీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న దుర్వాసన బాధలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే గ్రేటర్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా విషయాన్ని వివరించారు. వ్యర్థ రసాయనాలను పారబోస్తున్న లారీలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన తట్టిఅన్నారం కాలనీవాసులు


ఎమ్మెల్యే రంగారెడ్డికి సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని పలు కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తట్టిఅన్నారంలోని ఊరచెరువు దిగువన ఉన్న మారుతీనగర్, రాఘవేంద్రనగర్ కాలనీలోని రోడ్లపై ఊటనీరు వస్తుందన్నారు. దీంతో రోడ్లు చిత్తడిగా మారడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు మారుతీనగర్‌కాలనీ అధ్యక్షుడు భాస్కరాచారి తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంజీనాయక్, వేణుగోపాల్‌రెడ్డి, జంగయ్య, మాసయ్య, కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి అకాడమిక్ కోఆర్డినేటర్ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏవీఎన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడుతూ భారత్ ఫార్మసీ రంగంలో దూసుకుపోతుందన్నారు. ఫార్మసీ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫార్మసీ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : శ్వేతారెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

సైదాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీలో రూ.5.98లక్షలతో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌బాబు, సుబ్బారెడ్డి, సోమయ్య, వెంకటేశ్వర్‌రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు ఆరోగ్యానికి మేలు : నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రసాయనాలు లేకుండా సేంద్రియ సాగుతో సహజ పద్ధతుల్లో పండించే పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. టీజీఎస్‌పీడీసీఎల్‌లో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ మాద జానయ్య డివిజన్ పరిధిలోని హిమపురికాలనీ ఫేజ్-2లో గల తన ఖాళీ ప్లాటులో 20 రకాల కూరగాయలను సేంద్రియ పద్ధతిలో పండించడాన్ని కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలు నిరుపయోగంగా ఉండకుండా ఖాళీ ప్లాట్ల యజమానులు ఇలా సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడం వారికే కాకుండా పరిసరాల పరిరక్షణకు ఎంతో దోహదపడుతోందన్నారు. సేంద్రియ సాగు చేసిన మాద జానయ్యను కార్పొరేటర్ అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు రవికుమార్, రామచంద్రయ్య, వెంకటరెడ్డి, జయరాంరెడ్డి పాల్గొన్నారు.

ఏక్ దిన్ ఏక్ గంట.. ఏక్‌సాత్

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏక్ దిన్ ఏక్ గంట.. ఏక్‌సాత్ శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తట్టిఅన్నారంలోని జీఎస్‌ఐ కార్యాలయం నుంచి సెంట్రల్‌గ్రౌండ్ వాటర్‌బోర్డు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై ఉన్న చెత్త, చెదారాన్ని వారు శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్, జీఎస్‌ఐ హెచ్ఓడీ సౌత్ రీజియన్ బాసబ్ ముకోపాధ్యాయ్, మున్సిపల్ డీఈఈ జ్యోతిరెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

మన్సూరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని నాగోల్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్‌ఐ) సంస్థ అదనపు డైరెక్టర్ జనరల్, హెచ్ఓడీ బసబ్ ముఖోపాధ్యాయ పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ సహకారంతో బండ్లగూడ జీఎస్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం సంస్థ ఆవరణలో 'ఏక్ దిన్-ఏక్ గంట-ఏక్ సాత్' నినాదంతో స్వచ్ఛభారత్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బసబ్ ముఖోపాధ్యాయ విచ్చేసి సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పరిసరాలను పరిశుభ్రపరిచడంతో పాటు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు, పౌర సంబంధాల అధికారి డాక్టర్ గంజి మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన మహిళలతోనే శక్తివంతమైన కుటుంబం, సమాజం సాధ్యం : పవన్‌కుమార్

కొత్తపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళలతోనే శక్తివంతమైన కుటుంబం, సమాజం సాధ్యమని స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారి డా.సౌమ్య ఆధ్వర్యంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలందరికీ ఉచిత వైద్య ఆరోగ్యసేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 15 సంవత్సరాల నుండి 49 సంవత్సరాల వయసు గల మహిళలందరూ ఈ శిబిరాలకు రావచ్చని వైద్యాధికారి డా.సౌమ్య తెలిపారు. జనరల్ ఫిజీషియన్ డా.అంజని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు తగిన సూచనలు, మందులు అందజేశారు.

కారు డ్రైవర్ ఆత్మహత్య

కొత్తపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో మన్సూరాబాద్‌లో గురువారం ఒక కారుడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కారు డ్రైవర్ కోస్గి ప్రశాంత్‌కుమార్(28) భార్యాపిల్లలతో కలిసి మన్సూరాబాద్ డబుల్ బెడ్‌రూమ్ అపార్టుమెంట్లలో ఉండేవాడు. అతడు ఓ వివాహితతో చనువుగా ఉండేవాడు. విషయం తెలుసుకున్న అతడి తల్లి, అత్త ఇతర పెద్దలు అలా వివాహితతో చనువుగా ఉండడం తగదని అతడికి నచ్చజెప్పారు. ఇటీవలే అతడి భార్యాపిల్లలు పండుగకు మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. అతడు గురువారం తెల్లవారు జామున తన గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం 10.30కు అతడి స్నేహితుడు గంగాధరి శాంతికుమార్ అతడికి ఫోన్ చేశాడు. స్పందించకపోవడంతో అతడు ప్రశాంత్‌కుమార్ గదికి వచ్చాడు. తలుపుతెరవకపోవడంతో పగులగొట్టి చూస్తే ప్రశాంత్ కుమార్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. పొరుగింటి వారితో కలిసి అతడిని కిందకు దించారు. సైదాబాద్ సాయిరాం కాలనీలో ఉండే మృతుడి తల్లి సమాచారం అందుకుని, ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


నాగోల్ మహంకాళి ఆలయ మండపం వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న బస్వరాజు శ్రీనివాసరాజు


చంపాపేట డివిజన్ దుర్గానగర్‌కాలనీలో దుర్గామాత మండపంలో పూజలు చేస్తున్న రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, వంగా జగన్నాథ్‌రెడ్డి


హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ డైరెక్టర్లు సందీప్‌రెడ్డి, అంజయ్యగుప్తా


సైదాబాద్ పురవీధుల్లో అమ్మవారి పల్లకీసేవ

కాత్యాయనీదేవిగా అమ్మవారు

మన్సూరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం నాగోల్ డివిజన్ మన్సూరాబాద్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయ నీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

స్నేహపురి వేంకటేశ్వరాలయంలో..

కొత్తపేట: స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరాలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ నవకలశ పంచామృత అభిషేకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పద్మావతీదేవి, గోదాదేవి, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణాదేవి ప్రత్యేక అలంకారంలో భక్తులను అలరిస్తున్నారు.

చంపాపేట: చంపాపేట డివిజన్‌లోని దుర్గానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షు డు వంగా జగన్నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బూరం వెంకటేశ్, కోశాధికారి కిరణ్‌కుమార్‌గుప్తా, గౌరవాధ్యక్షుడు యాదవకృష్ణారెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


కాత్యాయనీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న మహాదుర్గా అమ్మవారు


కాత్యాయనీదేవి అవతారంలో దర్శనమిస్తున్న శ్రీసాయినగర్‌కాలనీలో ఆలయంలోని అమ్మవారు


గాయత్రిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న మహాలక్ష్మీ అమ్మవారు

హస్తినాపురం డివిజన్‌లో..

హస్తినాపురం డివిజన్ డిఫెన్స్‌కాలనీలోని హరిహర అయ్యప్పస్వామి ఆలయంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకొని దుర్గామాత గురువారం భక్తులకు కాత్యాయనీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో హోమాన్ని ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో నవరాత్రుల ఉత్సవ కమిటీ చైర్మన్ కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, బ్రహ్మశ్రీ రమణ గురుస్వామి, కులకర్ణి నితీష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో..

వనస్థలిపురం : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని హరిహరపురం కాలనీలోని ప్రసిద్ధ త్రిశక్తి ఆలయంలో గురువారం ఆలయంలోని మహాదుర్గాదేవి కాత్యాయనీదేవిగా, మహా సరస్వతీదేవి ఆదిలక్ష్మీదేవిగా, మహాలక్ష్మీదేవి గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ సంకల్పకర్త, చైర్మన్ డి.విజయభాస్కర్, మేనేజింగ్ ట్రస్టీ ఎన్.నారాయణరెడ్డి, కోశాధికారి కె.రవీందర్‌కుమార్ పాల్గొన్నారు.


శ్రీనివాస కల్యాణ మండపంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో పూజలందుకుంటున్న దుర్గాదేవి


కుర్మబస్తీలో అమ్మవారిని దర్శించుకున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు

సైదాబాద్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేటలలో అమ్మవారి ఆలయాలు, మండపాలు భక్తుల రాక తో పోటెత్తుతున్నాయి. సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గామాత, జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. కుర్మబస్తీలోని శివాంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మాతా జాగరణ్ కార్యక్రమం భక్తిపారవశ్యంతో కొనసాగింది.


మలక్‌పేట ప్రభుత్వ కళాశాల బతుకమ్మ సంబరాల్లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, లెక్చరర్లు


బతుకమ్మ వేడుకల్లో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

మన్సూరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్‌లోని తన నివాసం వద్ద అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, జీవనానికి బతుకమ్మ పండుగ ప్రతీకని, తీరొక్క పూలను బతుకమ్మలుగా పేర్చి దేవతగా పూజించడంలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.


దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో అధ్యాపకులు


గడ్డిఅన్నారంలోని ప్రగతి డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు, అధ్యాపకులు

సైదాబాద్ : బతుకమ్మ సంబరాల్లో భాగంగా గురువారం మలక్‌పేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి బతుకమ్మ ఆడారు. ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల ప్రిన్సిపాల్ జి.అరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి


అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీ హనుమంతరావు, జస్టిస్ చంద్రకుమార్, న్యాయవాదులు

కవాడిగూడ : తెలంగాణలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను వెంటనే అందజేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో న్యాయదీక్ష నిర్వహించారు. రాజ్యసభసభ్యుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జస్టిస్ చంద్రకుమార్‌లు హాజరై దీక్షకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా 15వేల స్టైఫండ్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హనుమంతరావు హామీఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, బీసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, న్యాయవాదులు తులసి రామ్, గిరీష్, శ్యామ్, సూర్య పాల్గొన్నారు.

ఇరువురి మధ్య ఘర్షణ, దాడి

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వేగంగా బైక్ నడపడంతో పక్కన ఉన్న మరొకరిపై నీళ్లు పడ్డాయి. దీంతో ఇరువురి మధ్య తలెత్తిన ఘర్షణ దాడికి దారి తీసింది. ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేట శంకర్‌నగర్ నివాసి షోయబ్ ఈనెల 22న బైక్‌ను వేగంగా నడపడంతో పక్క నుంచి వెళ్తున్న షేక్ షాబాజ్(19)పై నీళ్లు పడ్డాయి. దీంతో షాబాజ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ గొడవ పడ్డాడు. అనంతరం షోయబ్ తన అనుచరులతో తిరిగి వచ్చి షాబాజ్‌తో పాటు అతని తండ్రి షేక్ ఖాదిర్ ఎలియాస్ ఆదిల్ (41)పై దాడి చేయడంతో వీరిరువురు గాయపడ్డారు. ఈ మేరకు షాబాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో కేసులో..

శంకర్‌నగర్‌లో షోయబ్ బంధువులైన ఓమర్, ఓవైసీ కలిసి షోయబ్ తండ్రి షేక్ ఖదీర్ ఎలియాస్ ఆదిల్, సయ్యద్ అబ్దుల్ కరీంలపై పాతకక్షలతో బుధవారం అర్ధరాత్రి కర్రలు, ఇనుపరాడ్‌లతో దాడిచేశారు. ఈ ఘటనలో షేక్ ఖదీర్, అబ్దుల్ కరీంల తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. దాడికి కారకులైన ఓమర్, ఓవైసీ అతని అనుచరులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని షేక్ ఖదీర్ కుమారుడు అఫ్రోజ్‌అలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల వ్యాపారి అదృశ్యం

చంపాపేట : ఇంటి నుంచి బయటకు వెళ్లిన పండ్ల వ్యాపారి తిరిగి రాలేదు. హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన జాకీర్‌అలీ(35) ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. జాకీర్‌అలీ తల్లీ అమీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.

శ్రీశ్రీ హోమ్స్ ఖాళీ స్థలాలు కార్పొరేషన్‌కు అప్పగింత

సరూర్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): హైడ్రా ప్రమేయం లేకుండా రెండు ఖాళీ స్థలాలను, ఓ స్విమ్మింగ్ పూల్‌ను మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు కాలనీ అసోసియేషన్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. వెంచర్ నిర్వాహకులు..! దాంతో కాలనీవాసులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో గల శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో వెంచర్ చేసినప్పుడు రెండు ఖాళీ స్థలాలను వదలగా, మరో ఖాళీ స్థలంలో స్విమ్మింగ్‌పూల్ నిర్మించారు. ఇటీవల కాలనీకి కొత్తగా ఏర్పాటైన కమిటీ అధ్యక్షుడు రంజిత్‌కుమార్‌గౌడ్ అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో సదరు మూడు స్థలాల విషయమై వెంచర్ నిర్వాహకులతో, నేతలతో దఫదఫాలుగా చర్చలు జరిపారు. మునిసిపల్ అధికారులు సైతం సదరు స్థలాలను తమకు అప్పగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక దశలో ఖాళీ స్థలాలను కొందరు రాజకీయ నేతలు తప్పుడు డాక్యుమెంట్లతో సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినట్టు తెలిసింది. దాంతో అసోసియేషన్ ప్రతినిధులు పట్టుబట్టి మరీ సదరు మూడు స్థలాలను కాపాడుకున్నారు. ఈ క్రమంలో వెంచర్ నిర్వాహకులు సామ నర్సింహారెడ్డి, భూపతిరాజు రెండు ఖాళీ స్థలాలను బుధవారం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌కు, స్విమ్మింగ్‌పూల్‌ను కాలనీ అసోసియేషన్‌కు రిజిస్ట్రేషన్ చేశారు. దాంతో స్థానికులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. హైడ్రాలాంటి సంస్థల ప్రమేయం లేకుండా మూడు స్థలాలు రక్షించుకోగలిగామని, ఇందులో అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకుల సహకారం ఎంతో ఉన్నదని అధ్యక్షుడు రంజిత్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహారెడ్డి, కోశాధికారి వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు వల్లపు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, ధన్‌రాజ్‌రెడ్డి, జయరాంరెడ్డి, జంగయ్యగౌడ్, శ్రీనివాసులు, సర్వేశ్వర్‌రావు, గణపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


తుర్కయంజాల్‌లో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న భల్‌దేవ్‌రెడ్డి, బీజేపీ నాయకులు


పెద్దఅంబర్‌పేట్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


జిల్లెలగూడలో దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న రాజ్‌భూపాల్‌గౌడ్, శ్రీరాములుయాదవ్, నర్సింహారెడ్డి, ముఖేశ్‌ముదిరాజ్ తదితరులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

జోన్ బృందం: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన జయంతి కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నాగోల్‌లో మొక్కలు నాటి నీరు పోస్తున్న బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్


బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సింధూర్ ఎన్‌క్లేవ్ ఆవరణలో మొక్కను నాటుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి


హస్తినాపురం డివిజన్ అనుపమానగర్‌కాలనీలో పండిట్ దీన్ దయాళ్‌కు నివాళులు అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎరుకల మల్లేష్‌యాదవ్


చంపాపేట డివిజన్‌లోని మారుతీనగర్ కాలనీలో పండిట్ దీన్ దయాళ్‌కు నివాళులు అర్పిస్తున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పొరెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు


నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలో మొక్కను నాటి నీరు పోస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్


కృష్ణతులసినగర్ కమ్యూనిటీహాల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, సురేందర్‌రెడ్డి, దినేష్‌పటేల్


మొక్క నాటుతున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్పాల్‌గౌడ్